క్లుప్తంగా

కొనసాగుతున్న కమిషనర్ కక్ష సాధింపు చర్యలు



నెహ్రూనగర్: జనవరి 4వ తేదీన జరిగిన కౌన్సిల్ సమావేశంలో డెప్యూటీ మేయర్, కమిషనర్ తమాషా అన్న పదాన్ని భూత అద్దంలో కమిషనర్ పులి శ్రీనివాసులు చూపుతూ కక్ష సాధింపు చర్యలకు దిగారు. ఇందులో భాగంగా మేయర్, డెప్యూటీ మేయర్ల వద్ద పనిచేస్తున్న పలువురి సిబ్బందిని తొలగించిన విషయం తెలిసిందే. తాజాగా సీ సెక్షన్, కౌన్సిల్ సూపరింటెండెంట్‌గా నాలుగేళ్లుగా పనిచేస్తున్న ఎస్‌వీవీఎస్ మదన్‌గోపాల్‌ని ఆర్వోగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో కౌన్సిల్ సెక్రటరీగా విధులుగా నిర్వహిస్తున్న పి.శ్రీనివాసరావును అదనంగా కౌన్సిల్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించాలని సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రభుత్వం బెనిఫిట్ షోలకు అనుమతి సరికాదు

లక్ష్మీపురం: కొత్తగా విడుదల కానున్న సినిమా టికెట్ల ధరలను పెంచుతూ బెనిఫిట్ షోలకు అనుమతి ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వటాన్ని అవగాహన సంస్థ ఖండిస్తుందని, సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సంక్రాంతి సమయంలో విడుదలయ్యే గేమ్ ఛేంజర్, డాకు మహారాజ్, అనే రెండు సినిమాలకు ఏపీలో టికెట్ల ధరలు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేయడం సరికాదని తక్షణమే ఆదేశాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

వైభవంగా సంక్రాంతి సంబరాలు



నగరంపాలెం: స్థానిక సంగడిగుంట చలమయ్య కళాశాల ఆవరణలో సోమవారం అవోపా మహిళా విభాగ్, వాసవీ జాగతి క్లబ్ గర్తపురి సంయుక్త ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. రంగవల్లుల పోటీలు నిర్వహించగా, మహిళలు ఎంతో ఆసక్తిగా పాల్గొన్నారు. 150 మందికి పైగా ముగ్గుల పోటీల్లో ఉత్సాహంగా హాజరయ్యారు. నృత్యాలు, బొమ్మల కొలువులతో సంబరాలు చేశారు. అవోపా మహిళా విభాగం అధ్యక్షురాలు చింతా వసంత కల్పన, కార్యదర్శి నాళం కృష్ణకుమారి, కోశాధికారి రంగా రత్నశ్రీ, వాసవి జాగతి గర్తపురి క్లబ్ అధ్యక్షులు అద్దేపల్లి రాఘవేంద్రరావు, కార్యదర్శి గొడవర్తి బాలాజీ, కోశాధికారి మాటూరు శ్రీకాంత్, అవోపా అధ్యక్షులు కేవీ.బ్రహ్మం, కార్యదర్శి వెచ్చా రాధాకష్ణయ్య, కోశాధికారి మహంకాళి శ్రీనివాసరావు, రంగా చంద్రశేఖర్, సాధు శంకరరావు, డాక్టర్ మానస పాల్గొనగా విజేతలకు బహుమతులు అందించారు.

మోసం చేసి రెండో వివాహం చేసుకున్న వ్యక్తిపై కేసు నమోదు

లక్ష్మీపురం: మొదటి వివాహం చేసుకొని వివాహం కాలేదంటూ మోసం చేసి రెండో వివాహం చేసుకొని భార్యను వేధింపులకు గురి చేస్తున్న వ్యక్తిపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. వెంకటరమణ కాలనీకి చెందిన కొంగర శ్రావణికి, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి యూఎస్ఏకు చెందిన జలంధర్‌తో ఏడాది క్రితం వివాహమైంది. వివాహ సమయంలో రూ.30 లక్షల నగదు, 30 సవర్ల బంగారం కట్నం కింద ఇచ్చారు. వివాహం జరిగిన కొంతకాలానికి జలంధర్‌కు అంతకుముందే అయిన పెళ్లి విషయం శ్రావణికి తెలిసింది. ఈవిషయమై శ్రావణి భర్త జలంధరును నిలదీసింది. అప్పటి నుంచి జలంధర్, కుటుంబ సభ్యులు కలసి శ్రావణిని వేధింపులకు గురిచేయడం ప్రారంభించారు. బాధితురాలు సోమవారం సాయంత్రం నగరంపాలెం పోలీసులకు భర్త జలంధర్, ఆడబిడ్డ, అత్తలపై ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


పట్టభద్రులు ఓటర్లుగా నమోదు కావాలి

గుంటూరు ఎడ్యుకేషన్: డిగ్రీ పూర్తి చేసిన విద్యావంతులు పట్టభద్రుల ఓటర్లుగా నమోదు చేసుకోవాలని శాసనమండలి కృష్ణా-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. లక్ష్మీపురంలోని శ్రీ పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్లో సోమ వారం పట్టభద్రులైన అభ్యర్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీతారామయ్య పాఠశాలకు పూర్వ వైభవం తీసుకురావడం వెనుక కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ నిరంతర శ్రమ, కృషి ఉన్నాయని అన్నారు. కార్యక్రమంలో పెదకూరపాడు మాజీ ఎంపీపీ, ఎస్‌వీవీఎస్ వరప్రసాద్ పాల్గొన్నారు.

మళ్లీ అదే తప్పు చేస్తారా!

- సిఫార్సుల మేరకే వార్డు ఎమినిటీ సెక్రటరీలకు ఇన్‌చార్జి ఏఈ పోస్టుల కేటాయింపు
- గతంలో పది మందికి వార్డు ఎమినిటీ సెక్రటరీలకు ఇన్‌చార్జి ఏఈలుగా పోస్టింగ్ ఇచ్చిన నగర కమిషనర్
- సీనియార్టీ, రోస్టర్ లేకుండా పోస్టింగ్ ఇవ్వడంపై దుమారం
- ఇన్‌చార్జి ఏఈలుగా పనిచేస్తున్న పది మందిని తొలగించిన కమిషనర్

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ కార్యాలయాల్లో ఖాళీగా ఉన్న ఏఈ పోస్టుల్లో వార్డు ఎమినిటీ సెక్రటరీలను ఇన్‌చార్జి ఏఈలుగా వినియోగించుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో నగరపాలక సంస్థలో పది మంది ఎమినిటీ సెక్రటరీలను ఇన్‌చార్జి ఏఈలుగా గత ఏడాది సెప్టెంబర్‌లో పోస్టింగ్ ఇస్తూ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. దీనిపై కొంత మంది వార్డు ఎమినిటీ సెక్రటరీలకు సీనియార్టీ లేకుండా, రోస్టర్ విధానం పాటించకుండా, విధులకు గైర్హాజరైన వారికి ఏ విధంగా ఇన్‌చార్జి పోస్టింగ్‌లు ఇస్తారంటూ వార్డు ఎమినిటీ సెక్రటరీల నుంచి వ్యతిరేకత రావడంతో గత సంవత్సరం డిసెంబర్ 31వ తేదీన ఇన్‌చార్జి ఏఈలుగా పనిచేస్తున్న 10 మంది వార్డు ఎమినిటీ సెక్రటరీలను వారి వారి విధుల నుంచి తొలగిస్తు ఉత్తర్వులు జారీ చేశారు. తిరిగి ఎమినిటీ సెక్రటరీలకు ఇన్‌చార్జి ఏఈలుగా పోస్టింగ్ ఇచ్చే బాధ్యత నెల్లూరు జిల్లాలోని పబ్లిక్ హెల్త్ ఎస్ఈ(జోనల్ ఆఫీసర్) సిఫార్సుల మేరకే పోస్టింగ్‌లు ఇచ్చేందుకు సిద్ధమైయ్యారు. దీనిపై జనవరి 5వ తేదీన సాక్షిలో 'పోస్టింగ్ ఇచ్చారు.. తిరిగి లాక్కున్నారు' అనే కథనం ప్రచురితమైంది. ఇంతలోనే మళ్లీ కొత్త పేర్లతో ఇన్‌చార్జి ఏఈలుగా పోస్టింగ్ ఇచ్చేందుకు నెల్లూరు ఎస్ఈ జాబితా సిద్ధం చేసి నగరపాలక సంస్థ పంపించారు. నగరపాలక సంస్థ కమిషనర్ ఈ జాబితాను ఫైనల్ చేసి పోస్టింగ్ ఇవ్వడమే తరువాయి.



ఇన్‌చార్జి ఏఈలుగా పోస్టింగ్ ఇచ్చేందుకు గాను నెల్లూరు పబ్లిక్ హెల్త్ ఇచ్చిన పేర్లు..

విజిలెన్స్ ఎంక్వయిరీ సెక్రటరీలకు కూడా పోస్టింగ్

వార్డు ఎమినిటీ సెక్రటరీలకు ఇన్‌చార్జి ఏఈ పోస్టింగ్ విషయంలో తమ అనుకునే వారికి పోస్టింగ్ ఇచ్చే విధంగా కార్యాలయ సిబ్బంది చక్రం తిప్పినట్లు తెలుస్తుంది. ఇందులో ఓ ఏఈ సోదరికి ఇన్‌చార్జి ఏఈ పోస్టింగ్ ఇచ్చేందుకు రంగం సిద్ధం చేసినట్లు తెలుస్తుంది. దీంతో పాటు డ్రాయింగ్ బ్రాంచిలో పనిచేస్తున్న ఓ ఎమినిటీ సెక్రటరీకి, కేంద్ర మంత్రి సిఫార్సు మేరకు మరో సెక్రటరీకి, నాన్ లోకల్ వ్యక్తి కూడా పోస్టింగ్, విజిలెన్స్ ఎంక్వయిరీ నడుస్తున్న నలుగురు సెక్రటరీలకు కూడా పోస్టింగ్ ఇచ్చారు.

ఎస్టీలకు అవకాశం లేదు

రోస్టర్ పాయింట్ల ప్రకారం ముందు ఓసీ ఉమెన్‌కి ఇచ్చిన తరువాత, ఎస్సీ, ఎస్టీలకు ఇవ్వాలి. అయితే ఓసీ ఉమెన్‌లో కూడా మెరిట్ జాబితాలో ఉన్న మహిళకు ఇవ్వకుండా తక్కువ మార్కులు వచ్చిన మహిళకు(ఏఈ చెల్లెలు కావడంతో) ఇచ్చారు. ఎస్సీల్లో మెరిట్ జాబితాను పక్కన పెట్టి, వారి సన్నితులకు పోస్టింగ్, ఇందులో కొసమెరుపేమిటంటే ఒక ఎస్టీ సెక్రటరీ కూడా పోస్టింగ్ రాలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఈ జాబితా విడుదలపై పలువురు ఎమినిటీ సెక్రటరీలు నెల్లూరు పబ్లిక్ హెల్త్ ఎస్ఈ కార్యాలయంలో సంప్రదించగా... సదరు జాబితా గుంటూరు నగరపాలక సంస్థ నుంచే వచ్చిందని... ఇక్కడ నగరపాలక సంస్థలో అడిగితే నెల్లూరు ఎస్ఈ ఇచ్చారని ఒకరి మీద ఒకరు చెప్పుకుంటున్నారు. ఈ పోస్టింగ్‌లపై ఇంజినీరింగ్ అండ్ ఆఫ్ చీఫ్‌ను కలిసి వినతి పత్రాలు ఇచ్చేందుకు ఎమినిటీ సెక్రటరీలు సిద్ధమైనట్లు తెలుస్తుంది.

కోర్టుకు వెళ్లేందుకు సిద్ధం

గతంలో ఇచ్చిన పోస్టింగ్‌లలో రోస్టర్, సీనియార్టీ ప్రకారం చూడకుండానే పోస్టింగ్ ఇచ్చారనే వార్డు ఎమినిటీ సెక్రటరీలు బలంగా తమ వాదనలు వినిపిస్తున్న క్రమంలో తిరిగి అదే తప్పు చేస్తూ నెల్లూరు పబ్లిక్ హెల్త్ ఎస్ఈ పది మందికి తిరిగి ఇన్‌చార్జి ఏఈ పోస్టింగ్ ఇచ్చేందుకు జాబితా సిద్ధం చేయడంపై వార్డు ఎమినిటీ సెక్రటరీలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై వార్డు ఎమినిటీ సెక్రటరీలు కోర్టును ఆశ్రయించేందుకు సిద్ధపడ్డారని తెలుస్తుంది.

అర్జీలను క్షేత్రస్థాయి అధికారులు పరిశీలించాలి

కార్పొరేషన్ కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: నగరంలో స్థానిక సమస్యల పరిష్కారం కోసం నగరపాలక సంస్థలో చేపట్టే డయల్ యువర్ కమిషనర్, పీజీఆర్ఎస్‌లో ప్రజలు ఇస్తున్న అర్జీలు రీ ఓపెన్ కాకుండా అధికారులు సమగ్రంగా పరిశీలించి, శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. సోమవారం నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్, కౌన్సిల్ హాల్లో పీజీఆర్ఎస్ నిర్వహించారు. తొలుత డయల్ యువర్ కమిషనర్ ద్వారా ప్రజల నుంచి అందిన 24 ఫిర్యాదులు తీసుకొని, అధికారులతో మాట్లాడుతూ ప్రజల నుంచి అందే అర్జీల్లో తక్షణం పరిష్కారం చేయగలిగినవి, కొంత సమయం తర్వాత చేయగలిగినవి వేరువేరుగా లిస్టు తయారు చేయాలని కోరారు. డయల్ యువర్ కమిషనర్‌కి అందిన అర్జీల పరిష్కారానికి విభాగాధిపతులే క్షేత్ర స్థాయి పరిశీలనకు వెళ్లాలన్నారు. అర్జీల పరిష్కార పురోగతిపై కమిషనర్ చాంబర్‌కు ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం కౌన్సిల్ సమావేశ మందిరంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి అర్జీలు తీసుకొని అధికారులతో మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌లో ప్రజలు ఇస్తున్న అర్జీలను సమగ్రంగా పరిష్కారం చేయాలని, ఆయా అర్జీలను ర్యాండమ్‌గా క్షేత్ర స్థాయి పరిశీలన చేస్తామన్నారు. అర్జీలు బీఎండ్ ఎస్ఎల్ఏ లోకి వెళ్లడానికి వీలులేదన్నారు. క్షేత్ర స్థాయి అధికారులు అర్జీలను నేరుగా వెళ్లి పరిశీలించి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 40 ఫిర్యాదులు అందాయని వాటిలో పట్టణ ప్రణాళిక విభాగానికి 11, ఇంజినీరింగ్ విభాగానికి 15, రెవెన్యూ విభాగానికి 2, ప్రజారోగ్య విభాగానికి 4, అకౌంట్స్ విభాగానికి 8 ఫిర్యాదులు అందాయని, వాటిని నిర్దేశిత గడువు లోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ సీహెచ్.ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, సీఎంఓహెచ్ డాక్టర్ అమృతం, సిటీ ప్లానర్ రాంబాబు, ఈఈ సుందర్రామిరెడ్డి పాల్గొన్నారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్

విద్యార్జన సమాజ హితాన్ని ప్రతిబింబించేలా ఉండాలి

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్జన సమాజ హితాన్ని ప్రతిబింబించేలా ఉండాలని విష్ణుభట్ల నాగ శంకర వేంకట లక్ష్మీనారాయణ ఘనపాఠీ అన్నారు. సోమవారం మార్కెట్ సెంటర్‌లోని హిందూ కళాశాల ప్రాంగణంలోని ఏకాదండయ్య పంతులు హాల్లో శ్రీచెబువు సూర్యనారాయణమూర్తి- శ్రీమతి సీతారావమ్మ పురస్కార ప్రదానోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా బ్రహ్మశ్రీ విష్ణుభట్ల నాగ శంకర వేంకట లక్ష్మీనారాయణ ఘనపాఠీకి పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ సుఖంగా జీవించాలని కోరుకోవడం సత్కార్యమని అన్నారు. సభకు అధ్యక్షత వహించిన హిందూ కాలేజీ - హైస్కూల్స్ కౌన్సిల్ అధ్యక్షుడు గబ్బిట శివరామకృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ వేద పరిరక్షణలో దేశ సంస్కృతి పరిరక్షణ, మానవాళి క్షేమం దాగివున్నాయని చెప్పా రు. చెబువు సూర్యనారాయణ మూర్తి విద్యా సంస్థలకు అందించిన సేవలను కొనియాడారు. వ్యాకరణ విద్యాప్రవీణ డాక్టర్ ముళ్లపూడి సత్యనారాయణ శాస్త్రి మాట్లాడుతూ విద్యా రంగంలో అందించే సేవలకు సమాజ గుర్తింపు ఉంటుందని, ఇదే కోవలో సూర్యనారాయణమూర్తి సేవలు పలువురికి స్ఫూర్తినిచ్చాయని తెలిపారు. హిందూ కాలేజీ అండ్ హైస్కూల్స్ కౌన్సిల్ ప్రధాన కార్యదర్శి కేఎస్ఆర్ కుటుంబరావు మాట్లాడుతూ చెబువు సూర్యనారాయణమూర్తి తెలుగు భాషను ప్రేమించే వారని, ఆయనకు కొన్ని వందల పద్యాలు వచ్చని, ఆయనతో కలిసిన ప్రతి సందర్భంలో ఒక సాహిత్య గోష్ఠి జరుగుతున్నట్లు ఉండేదన్నారు. సన్మానకర్త చెబువు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ తండ్రి మమ్మల్ని పెంచిన తీరు గుర్తు చేసుకుని ఉద్వేగానికి లోనయ్యారు. ఆయన పేరుతో ప్రతి యేటా ప్రముఖులకు పురస్కారాన్ని ప్రదానం చేయడం ద్వారా వారిని స్మరించుకోవడం తమ అదృష్టంగా భావిస్తున్నామని అన్నారు. ఈసందర్భంగా శతక పద్య పోటీ విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో హిందూ కళాశాల కార్యదర్శి చెబువు రామకృష్ణమూర్తి పాల్గొన్నారు.



విష్ణుభట్లను పురస్కారంతో సత్కరిస్తున్న సత్యనారాయణ శాస్త్రి, సత్యనారాయణమూర్తి, శివరామకృష్ణప్రసాద్

సామాజిక సేవలో భాగస్వాములు కావాలి

- స్ఫూర్తి ఫౌండేషన్ వ్యవస్థాపకులు, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి
- నిర్మల్ హృదయ్‌లో దుప్పట్లు పంపిణీ

పట్నంబజారు: దశాబ్దాల క్రితమే మహోన్నత సేవా దృక్పథంతో మదర్ థెరిస్సా స్థాపించిన నిర్మల్ హృదయ్‌లో ఓ వైపు ప్రార్థించే పెదవులతో పాటు, మరోవైపు సాయం చేసే చేతులు కూడా సిద్ధంగా ఉంటాయని ఎమ్మెల్సీ, స్ఫూర్తి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు లేళ్ల అప్పిరెడ్డి చెప్పారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం బ్రాడీపేటలోని నిర్మల్ హృదయ్‌లో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ గురజాడ అప్పారావు చెప్పినట్లు ప్రతి ఒక్కరూ సొంత లాభం కొంత మానుకుని పొరుగువారి సంక్షేమానికి సాయపడాలని పిలుపునిచ్చారు. అప్పుడే సమాజంలో పేదరికం సమసిపోయి అన్నార్తులు, అనాథలు ఉండని నవ యుగం ఆరంభమౌతుందన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి బందా రవీంద్రనాథ్, కార్పొరేటర్లు ఈచంపాటి వెంకటకృష్ణ(ఆచారి), అచ్చాల వెంకటరెడ్డి, పడాల సుబ్బారెడ్డి, పాపతోటి అంబేద్కర్, దూపాటి వంశీ, బోడపాటి కిశోర్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ బత్తుల దేవానంద్, గీతా మందిరం చైర్మన్ వెలుగూరి రత్నప్రసాద్, నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పరిశపోగు శ్రీనివాసరావు, పార్టీ నేతలు మేడా సాంబశివరావు, గోళ్ళ శివశంకర్ యాదవ్, కొత్తపేట సతీష్, వెంకటరమణ, షేక్ రబ్బానీ, రెడ్డి కోటేశ్వరరావు, భాగ్యారావు, ప్రసన్న, యాదాల చిన్న, బెంజమిన్, సుబ్బరాజు, రేజేటి నవీన్, నీలి, మనోజ్, రత్నకుమారి, రమణి, విజయమ్మ, సత్యవతి, ఆలా కిరణ్, కాటూరి విజయ్, దాసు, బందా అంజి, నాని, సునీల్ పాల్గొన్నారు.



దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ అప్పిరెడ్డి

బాలకృష్ణమ్మ కృషి మరువలేనిది



గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయుల సంక్షేమం కోసం పాటుపడిన మార్పు బాలకృష్ణమ్మ చిరస్మరణీయుడని ఏపీటీఎఫ్(1938) రాష్ట్ర కార్యదర్శి మేకల సుబ్బారావు పేర్కొన్నారు. సోమవారం నగరంపాలెంలోని ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ మార్పు బాలకృష్ణమ్మ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈసందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షునిగా, ఉపాధ్యాయ ఉద్యమనేతగా బాలకృష్ణమ్మ చేసిన కృషి ఫలితంగానే ప్రస్తుతం ఉపాధ్యాయులు అనేక సదుపాయాలను పొందుతున్నారని అన్నారు. సీనియర్ నాయకుడు ఏవీ రామారావు మాట్లాడారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.వేళాంగిణిరాజు, కె.నరసింహారావు, జిల్లా సహాధ్యక్షుడు ఓ.నాగార్జున, ఆడిట్ కమిటీ చైర్మన్ జె.వి జయానంద్, నగర గౌరవాధ్యక్షుడు ఎం.భాస్కర్‌రావు పాల్గొన్నారు.

పాఠశాలల ఆధునికీకరణపై అంతులేని నిర్లక్ష్యం

- నిలిచిన తరగతి గదుల నిర్మాణాలు
- గత ప్రభుత్వంలో రూ.48 లక్షలతో పనులు ప్రారంభం
- కేవలం రూ.ఐదు లక్షలు ఖర్చు చేస్తే అందుబాటులోకి వచ్చే తరగతి గదులు
- ఆర్నెల్లుగా దృష్టి సారించని వైనం



కేవీపీ కాలనీలోని కేఎస్సార్టీ హైస్కూల్లో అసంపూర్తిగా నిలిచిన నాలుగు తరగతి గదుల నిర్మాణ పనులు

గుంటూరు ఎడ్యుకేషన్: కూటమి ప్రభుత్వ పాలన విద్యారంగానికి గొడ్డలిపెట్టుగా మారింది. మన బడి నాడు- నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను ఆధునిక వసతులతో తీర్చిదిద్దిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులకు ప్రస్తుత కూటమి పాలనలో గ్రహణం పట్టింది. నాడు-నేడు రెండో దశలో చేపట్టిన ఆధునికీకరణ పనులు కొలిక్కి వచ్చిన సమయంలో కూటమి పాలనలో పూర్తిగా నిలిచిపోయాయి. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 27 నగరపాలక సంస్థ, జెడ్పీ మండల పరిషత్ యాజమాన్యాల్లోని రూ.16.44 కోట్లతో చేపట్టిన ఆధునికీకరణ పనులు ప్రస్తుతం ఎక్కడి కక్కడ నిలిచిపోయాయి. గత ప్రభుత్వంలో పాఠశాల భవన సముదాయాల ఆధునికీకరణతో పాటు మేజర్, మైనర్ రిపేర్లు, టాయిలెట్లు, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అదనపు తరగతి గదుల నిర్మాణాలు, 10 అంశాల ప్రాతిపదికన మౌలిక వసతుల కల్పనకు సంబంధించిన పనులను చేపట్టారు.

గత ప్రభుత్వ పాలనలో చేపట్టిన నాడు- నేడు రెండో విడత అభివృద్ధి పనులు ప్రస్తుత కూటమి పాలనలో ఏ విధంగా నిర్లక్ష్యానికి గురయ్యాయో చెప్పేందుకు గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలో కేవీపీ కాలనీలో ఉన్న కేఎస్సార్టీ నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల ఒక ఉదాహరణగా చెప్పవచ్చు. 10 కాంపొనెంట్స్ వారీగా ఆధునిక వసతులతో అభివృద్ధి పర్చేందుకు నాడు- నేడు రెండో దశలో రూ.1.69 కోట్లతో పనులు ప్రారంభించారు. పాఠశాలలో చదువుతున్న 280 మంది విద్యార్థులకు సరిపడా తరగతి గదులను అందుబాటులోకి తెచ్చేందుకు ఒక్కొక్కటి రూ.12 వ్యయంతో ఏడాది క్రితం నాలుగు తరగతి గదుల నిర్మాణాలను ప్రారంభించారు. గత ఏప్రిల్ నాటికి తరగతి గదుల నిర్మాణాలు పూర్తయ్యాయి. కాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పనులు నిలిచిపోయాయి. తరగతి గదులను పూర్తి చేసేందుకు అవసరమైన సామగ్రిని పాఠశాలకు పంపినప్పటికీ, పనులు ఆగిపోయాయి. ఇసుక, కంకర, ఇటుక ఉన్నప్పటికీ సిమెంట్ సరఫరా చేయకపోవడంతో 90 శాతానికి పైగా పూర్తి అయిన తరగతి గదుల నిర్మాణం చివరి దశలో నిలిచిపోయింది. పాఠశాల బ్యాంకు ఖాతాలో రూ.10 లక్షలు నిధులు ఉండగా, కేవలం రూ.ఐదు లక్షల ఖర్చు కాగల తరగతి గదుల నిర్మాణాలను అర్ధాంతరంగా నిలిపివేశారు. సకాంలో తరగతి గదులను పూర్తి చేసి ఉంటే విద్యార్థులకు అందుబాటులోకి వచ్చి ఉండేవని ఉపాధ్యాయులతో పాటు సంఘాల నాయకులు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంతో నిలిచిన నాడు- నేడు అభివృద్ధి పనులకు ఇది ఒక ఉదాహరణ మాత్రమే.

కార్మికులకు పీపీఈ కిట్లు పంపిణీ

నెహ్రూనగర్: ప్రజారోగ్యం కాపాడే కార్మికులు తమ ఆరోగ్య పరిరక్షణకు కూడామ తగిన శ్రద్ధ చూపాలని, విధుల్లో తగిన రక్షణ పరికరాలు ధరించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు సూచించారు. సోమవారం కేంద్ర ప్రభుత్వ, రాష్ట్ర ప్రభుత్వ స్వచ్ఛాంధ్రప్రదేశ్ నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజ్డ్ శానిటేషన్ ఎకో సిస్టం(నమస్తే)లో భాగంగా గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని అండర్ గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ) కార్మికులకు పర్సనల్ ప్రొటెక్షన్ ఎక్విప్మెంట్(పీపీఈ) కిట్లను కమిషనర్ అందించారు. కార్మికులు 121 మంది ఉండగా, వారిలో తొలుత 50 మందికి పీపీఈ కిట్లు అందించగా ప్రస్తుతం మరో 70 మందికి అందజేశారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ సిహెచ్.ఓబులేసు, డెప్యూటీ కమిషనర్ డి.శ్రీనివాసరావు, సీఎంఓహెచ్ డాక్టర్ అమృతం, ఈఈ సుందర్రామిరెడ్డి, నమస్తే స్కీం రాష్ట్ర కో ఆర్డినేటర్ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్యాంజలి



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై కళావిపంచి(హైదరాబాద్), కథక్ కళాక్షేత్ర, కళ పత్రిక సంయుక్తంగా సోమవారం సాయంత్రం నృత్యాంజలి కార్యక్రమం నిర్వహించారు. కళపత్రిక సంపాదకులు డాక్టర్ మొహమ్మద్ రఫీ సభాధ్యక్షత వహించారు. అనంతరం అంజుబాబు, గురుబనీతనాగ్ శిష్య బృందం ప్రదర్శించిన కథక్ నృత్యం, గురు సుస్మిత మిశ్రా గ్రూప్ ప్రదర్శించిన ఒడిసీ నృత్యం, తరంగిణి మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ గురు పద్మజ విశ్వాస్ కూచిపూడి నృత్యం, గురు బిజినా సురేంద్రనాథ్ అండ్ గ్రూప్ మోహిని అట్టం నృత్యం అలరించాయి. ముఖ్య అతిథి ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ మాట్లాడుతూ నయనానందకరంగా పలు రాష్ట్రాల నృత్య ప్రదర్శనలను ప్రదర్శించడం అభినందనీయమని అన్నారు. నృత్య కళాకారులను, గురువులను ఆయన అభినందించారు. కేసీపీ లిమిటెడ్ వైస్‌చైర్మన్ డాక్టర్ వజ్ఞా మధుసూదనరావు, రామరాజు ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ రామరాజు శ్రీనివాసరావు, గ్లోబల్ హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ నిర్వాహకులు బాబు మిరియం, పాలక మండలి అధ్యక్షులు సి.హెచ్.మస్తానయ్య, తెనాలి బ్రేక్ ఇన్‌స్పెక్టర్ మధుసూదనరావు మాట్లాడారు. కథక్ కళాక్షేత్ర అధ్యక్షులు డాక్టర్ కథాకా అంజిబాబు, కళావిపంచి అధ్యక్షులు బొప్పన నరసింహారావు, జి.వి.జి శంకర్, ఆరాధన ఆర్ట్స్ అకాడమీ నిర్వాహకులు డి.తిరుమలేశ్వరరావు, యువ కళావాహిని ప్రధాన కార్యదర్శి జి.మల్లికార్జునరావు పాల్గొనగా, కళాకారులను, అతిథులను సత్కరించారు.

రెడ్డిపాలెం ఇన్నర్ రింగ్ రోడ్డు పనులు వేగవంతం

నెహ్రూనగర్: రెడ్డిపాలెం, ఇన్నర్ రింగ్ రోడ్ విస్తరణ పనులు వేగంగా చేపట్టడానికి చర్యలు తీసుకోవాలని, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారులు సమన్వయంతో ప్రజలకు ఇబ్బందులు లేకుండా పనులు చేపట్టాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. సోమవారం కమిషనర్ సంజీవయ్య నగర్ రైల్వే గేటు నుంచి రెడ్డిపాలెం, ఇన్నర్ రింగ్ రోడ్డు వరకు చేపట్టిన రోడ్డు విస్తరణ పనులను పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ మాస్టర్ ప్లాన్, రోడ్ డెవలప్మెంట్ ప్లాన్(ఆర్డీపీ) మేరకు రోడ్ విస్తరణ పనులు పక్కా ప్రణాళిక మేరకు పనులు జరిగేలా పట్టణ ప్రణాళిక అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. శంకర్ విలాస్ ఆర్వోబీ నిర్మాణ పనులు ప్రారంభమైతే నగరంలో ట్రాఫిక్ సమస్య పెరుగుతుందని, అందుకు తగిన విధంగా ఆయా మార్గాలను అభివృద్ధి చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ప్లాన్ మేరకు తొలుత మార్కింగ్ చేసి, ప్రభావిత భవన యజమానులకు నోటీసులు అందించి, ఎకనాలడ్జిమెంట్ తీసుకోవాలని ఆదేశించారు. పట్టణ ప్రణాళిక అధికారులు భవనాల తొలగింపు చేపట్టిన అనంతరం వెంటనే డ్రెయిన్, రోడ్ నిర్మాణ పనులు ప్రారంభించడానికి ఇంజినీరింగ్ అధికారులు టెండర్ ప్రక్రియ పూర్తి చేసి సిద్ధంగా ఉండాలన్నారు. అనంతరం సంజీవయ్య నగర్ రైల్వే గేటు దగ్గర జరుగుతున్న పైప్ లైన్ ఇంటర్ కనెక్షన్ పనులను పరిశీలించి, పనులను త్వరగా పూర్తి చేయడానికి ఇంజినీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని, పనులను నాణ్యతగా చేపట్టేలా పర్యవేక్షణ చేయాలన్నారు. పర్యటనలో సిటీ ప్లానర్ రాంబాబు, ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, డీసీపీ సూరజ్ కుమార్, ఈఈ కోటేశ్వరరావు, డీఈఈ రమేష్ బాబు, ఎస్ఎస్ ఆయూబ్ ఖాన్, ఏఈ రవి కిరణ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అంగడి రాజేష్ పాల్గొన్నారు.



సంజీవయ్యనగర్ వద్ద మెయిన్ రోడ్డు కొలతలను పరిశీలిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

ఉపాధ్యాయులు ఆదర్శనీయులుగా ఉండాలి

గుంటూరు ఎడ్యుకేషన్: వృత్తి నిబద్ధతతో పాఠశాలకే అంకితమైన ఉపాధ్యాయులు ఆదర్శనీయులుగా నిలుస్తారని జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక అన్నారు. వట్టిచెరుకూరు మండలం లేమల్లెపాడులోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పసుపులేటి శ్రీధర్ 2024లో ఏడాది పొడవునా ఒక్కరోజు కూడా సెలవు తీసుకోకుండా విధులు నిర్వర్తించినందుకు సోమవారం డీఈఓ కార్యాలయానికి ఆహ్వానించి సన్మానించారు. ఈసందర్భంగా రేణుక మాట్లాడుతూ గత 28 ఏళ్ల సర్వీసు కాలంలో అర్ధ వేతనపు సెలవులతో పాటు ఆర్జిత సెలవును సైతం వినియోగించుకోకుండా అంకితభావంతో పని చేయడం గొప్ప విషయమన్నారు. సెలవులు ఉన్నాయనే నెపంతో ఎటువంటి కారణం లేకుండా సెలవులు తీసుకునే ఉపాధ్యాయులు పాఠశాలలో పరిస్థితులను అర్థం చేసుకోవాలని సూచించారు. వట్టిచెరుకూరు ఎంఈఓ గరిమెళ్ల సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ లేమల్లెపాడు ఎంపీయూపీఎస్ పాఠశాలలో దాతల సహకారంతో చేపట్టిన విద్యాభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈసందర్భంగా ఉపాధ్యాయుడు శ్రీధర్ పాఠశాల పేరుతో దాతలు అందజేసిన నోటు పుస్తకాలు, విద్యార్థులు రాసిన యాత్రా గ్రంథం ''మా కళ్లతో కొండవీడు'' పుస్తకాన్ని డీఈఓ రేణుకకు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు మోదుగుల రవికృష్ణ, కార్యాలయ అకౌంటెంట్ చందు శ్రీనివాసులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయుడు శ్రీధర్‌ను సత్కరిస్తున్న డీఈఓ రేణుక

ఎస్ఎఫ్ఐ 2025 క్యాలెండర్ ఆవిష్కరణ

లక్ష్మీపురం: భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) జిల్లా కమిటీ ముద్రించిన క్యాలెండర్‌ను ఆర్జేడీ ఆఫీస్‌లో డిగ్రీ కళాశాల ఆర్జేడీ కళావతి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులలో సేవా భావాన్ని పెంపొందించాలని సూచించారు. ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్షుడు యశ్వంత్, సౌమ్య, సుభాని, సుధీర్, కార్తీక్, వంశీ పాల్గొన్నారు.